క్లుప్తంగా

నేడు కరెంటు సరఫరా ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: ఇబ్రహీంబాగ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మిలట్రీ–2, పెద్దమంగళారం ఫీడర్లలో మరమ్మతు పనుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు హిమాయత్‌నగర్ ఏఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సన్‌సిటీ, మాపిల్‌టౌన్, వికాస్ టౌన్, హైదర్ ఎన్‌క్లేవ్, కపిలానగర్‌లలో కోత ఉంటుందన్నారు. మాధవీనగర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 6.30 గంటల వరకు సాయిరామ్‌నగర్ కాలనీ, హీరాకాలనీ, సన్‌సిటీ మెయిన్ రోడ్డు, ఆర్మీ స్కూల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

హుడా కాలనీ పరిధిలో..

హుడాకాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హుడా కాలనీ, పాండురంగానగర్, శివాజీనగర్, సిక్‌చానీ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు.

మణికొండ ప్రాంతంలో..

మణికొండ: ఇబ్రహీంబాగ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ సందీప్‌రెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రాందేవ్‌గూడ, అలిజాపూర్, పాషాకాలనీ, నెక్నాంపూర్, తారామతి, వెసెల్లా విల్లాస్ ప్రాంతాలలో ప్రకటించిన సమయంలో సరఫరా ఉండదన్నారు.

హిమాయత్‌సాగర్ పరిధిలో...

హిమాయత్ సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సాయిరాంనగర్, వీరా కాలనీ, సన్‌సిటీ ప్రధాన రోడ్డు, ఆర్మీస్కూల్, మాదవీనగర్, పీఅండ్‌టీ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

నేడు సేవాలాల్ జయంతి ఉత్సవాలు

శంషాబాద్: మహాభోగ్ బండార్ పేరిట బుధవారం సంత్‌శ్రీ సేవాలాల్ 284 జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు శంషాబాద్ బంజారా సంఘం నేతలు ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎయిర్‌పోర్టు కాలనీ ప్రభుత్వ పాఠశాల మైదానం వద్ద జరిగే ఈ కార్యక్రమానికి బంజారాలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

'ప్రభుత్వ పాఠశాలలో కొత్త పోలీస్‌స్టేషన్ వద్దు'

గోల్కొండ: కొత్త పోలీస్‌స్టేషన్ల కోసం భవనాల పరిశీలన వివాదాస్పదంగా మారుతుంది. టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌ను విడదీసి గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు అధికారులు రెండు రోజుల క్రితం గుడిమల్కాపూర్‌లోని కూరగాయల కార్యాలయాన్ని పరిశీలించారు. అయితే రైతులు, వ్యాపారులు మాత్రం మార్కెటింగ్ భవనం అసలే చిన్నదిగా ఉందని భావి అవసరాల కోసం ఇది ఏమాత్రం సరిపోదని, ఇటువంటి భవనంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే బాగుండదని తన నిరసనలో వ్యక్తం చేశారు. అదేవిధంగా టోలీచౌకి పోలీస్‌స్టేషన్ భవనం కోసం కార్వాన్ ఎమ్మెల్యేతో పాటు పోలీసు అధికారులు టోలీచౌకి పరిసరాల్లో భవనాలను పరిశీలించారు. ఇందులో భాగంగానే వారు టోలీచౌకి చౌరస్తా వద్ద గల ప్రభుత్వ పాఠశాల భవనాన్ని కూడా పరిశీలించారు. అయితే అతి పురాతన ప్రభుత్వ పాఠశాలలో పోలీస్‌స్టేషన్ భవనం ఏర్పాటును పూర్వ విద్యార్థులతో పాటు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నారు.

త్వరలో రోడ్ల విస్తరణకు రూ.150 కోట్లు



గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధిపై తాను అసెంబ్లీలో లేవనెత్తిన అంశాలకు ఆయా శాఖల మంత్రులు స్పందించి నిధులు కేటాయిస్తామన్నారని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. అసెంబ్లీలో కార్వాన్ సమస్యలపై ప్రశ్నలు వేసినందుకు పలువురు మజ్లిస్ నాయకులు మంగళవారం ఆయనను టోలీచౌకిలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి రోడ్ల విస్తరణకు రూ.150 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. అదేవిధంగా గోల్కొండ ఏరియా ఆస్పత్రికి నూతన భవన నిర్మాణానికి రూ.4 కోట్లు మంత్రి హరీష్‌రావు మంజూరు చేశారన్నారు. బుల్కాపూర్ నాలా విస్తరణపై మంత్రి కేటీఆర్ స్పందించి నాలా మళ్లింపు విస్తరణకు రూ.8 కోట్లు మంజూరు చేశారన్నారు. గోల్కొండలోని చారిత్రక కట్టడాలను సుందరీకరించడం జరుగుతుందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తనకు హామీ ఇచ్చారన్నారు. కార్వాన్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుతో పాటు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కూడా నిధులు ఇస్తామని ఆ శాఖ మంత్రి తనకు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సాఫ్ మెడికల్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్, కార్పొరేటర్ నసిరుద్దీన్, బజర్‌ఉద్దీన్, హారూన్ ఫర్హాన్, సయ్యద్ జబ్బార్ పాల్గొన్నారు.

ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభం





పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, పూజల్లో పాల్గొన్న మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్ దంపతులు

మణికొండ: పుప్పాలగూడ కాశీ విశ్వేశ్వరాలయం ఆవరణలో అన్నపూర్ణదేవి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. వేదమంత్రాలతో పుప్పాలగూడ గ్రామం మారుమోగుతుంది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు మంగళవారం ఉదయం స్వస్తి వాచనము, విఘ్నేశ్వరపూజ, అంకురారోపణము, కంకణ ధారణ, యాగశాల ప్రవేశం, యజ్ఞశాల సంస్కారం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 4గంటల నుంచి నవగ్రహ, మాతృక, యోగిని, వాస్తు, క్షేత్ర పాలక, అగ్ని ప్రతిష్ఠ, ప్రధాన దేవ మంత్రహోవనము, పూర్వక జలాధివాసం పూజలు నిర్వహించారు. మొదటి రోజు పూజల్లో మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్ దంపతులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

16 నుంచి 19 వరకు కేదారనాథ్ దర్శనం



ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: అత్తాపూర్‌లో కేదారనాథ్ దర్శన కోసం ఉత్తరాఖండ్‌లోని కేదారనాథ్ మందిర ప్రతిరూపాన్ని నెలకొల్పుతున్నారు. 87వ మహా శివ రాత్రి మహోత్సవాల సందర్భంగా కేదారనాథ్ దర్శనం కల్పిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని శ్రీ చైతన్య స్కూల్ గ్రౌండ్‌లో ఈ దర్శనం కల్పిస్తున్నారు. ఈ నెల 16 నుంచి 19 వరకు ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం ఉంటుందన్నారు. 40 అడుగుల ఎత్తైన ఉత్తరాఖండ్‌లోని కేదారనాథ్ మందిర ప్రతిరూపం, ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ముఖ్యమైన శివలింగ దర్శనం, ఆధ్యాత్మిక చిత్ర ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, రాజయోగ శిక్షణ, ఒత్తిడి నుంచి విముక్తి, సకారాత్మక చింతన, సత్యమైన మనశాంతి తదితర విషయాలపై ప్రవచనాలు ఉంటాయన్నారు. భక్తులకు ఉచితంగా దర్శనం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సీబీఐటీతో సీడాక్ ఒప్పందం

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటరింగ్(సీ–డాక్)తో మంగళవారం కళాశాలలో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, గ్రిడ్, క్లౌడ్ కంప్యూటింగ్, బహుబాషా కంప్యూటింగ్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, ప్రొఫెషనల్ ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ సిటీస్ తదితర అత్యాధునిక, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో కలిసి పనిచేయటానికి రెండు సంస్థలు కృషి చేస్తాయని సీబీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులకు నైపుణ్యాభివృద్ధి కొరకు వివిధ కోర్సులపై శిక్షణ తీసుకునే అవకాశం కలిగిందన్నారు. కార్యక్రమంలో సీ–డాక్ హైదరాబాద్ డైరెక్టర్ లక్ష్మీ ఈశ్వరి, జాయింట్ డైరెక్టర్ జి.జ్యోత్స్న, ప్రొఫెసర్‌లు యూకే చౌదరి, వై.రమాదేవి, కె.రాధిక, డి.రామన్, జీఎస్‌ఆర్ ప్రసాద్, డాక్టర్ సంగీత గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

అడ్డగోలు ట్యాక్స్‌లను తగ్గించండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న వట్టినాగులపల్లి వాసులు

మణికొండ: అసలే జీవో 111 పరిధిలోని గ్రామం పెద్దగా నిర్మాణాలు, అద్దెలు రావు... అయినా గతంలో రూ. 5వేలు ఉన్న ఇంటికి ప్రస్తుతం ఏకంగా రూ.20వేల పన్ను వేసి చెల్లించమంటే ఎలా అని వట్టినాగులపల్లి వాసులు ప్రశ్నించారు. మంగళవారం నాయకులు కిషోర్ ఆధ్వర్యంలో పలువురు స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి తమ గ్రామంలో ఇష్టారాజ్యంగా ఇంటి పన్నులు పెంచారని, ఈ పన్నులు ప్రజలు కట్టలేరని తెలిపారు. దీంతో ఎమ్మెల్యే నార్సింగి మున్సిపల్ కమిషనర్‌ను ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం గ్రామస్తులు నార్సింగి మున్సిపల్ కమీషనర్ సత్యబాబును కలిసి తమ సమస్యను విన్నవించారు. పలు గృహాలకు గతంలో తక్కువగా ఉన్న పన్నులు ఈ సంవత్సరం ఒక్కసారిగా పెంచారని వాపోయారు. దీనిపై ఆయన స్పందిస్తూ పరిశీలించి పన్నులు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు దార వెంకటేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి రోజు పాదయాత్రలు చేస్తూ ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చే స్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని ప్రేమావతి పేటలో జీహెచ్‌ఎంసీ అధికారులు, పార్టీ నాయకులు, బస్తీ ప్రజలతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు వాటికి శాశ్వత పరిష్కారాలు చూపిస్తామన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సురేష్‌ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు అడికే జనార్ధన్, రఘుముదిరాజ్, టి.చిన్న, ఏ.రవి, ఎడ్లకాడి సూర్యం, ఏ.సుమన్, గడ్డం నవీన్, శ్రీకాంత్‌రెడ్డి, బబ్లూ, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సమేష్, బస్తీ వాసులు పాల్గొన్నారు.



ప్రేమావతిపేటలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

అక్రమాలను సహించం

మణికొండ: వాగులు, చెరువులను పూడ్చి ఆక్రమణలకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదని మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్ కౌన్సిలర్ బి. పద్మారావు అన్నారు. మంగళవారం ఆయన 7వ వార్డు కృష్ణారెడ్డి లేఅవుట్‌లో ఆక్రమణకు గురైన నాలాను మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలాలు, చెరువులను పూడ్చటంతో వర్షాకాలంలో అవిపొంగి ప్రవహించి పక్కనున్న కాలనీలను ముంపునకు గురిచేస్తున్నాయన్నారు. అలాంటి అక్రమాలను సహించే ప్రసక్తే లేదన్నారు. అనంతరరం ఆయన ప్రధాన రహదారిలో జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. అందులో ఇసుకకు బదులుగా రాతి పొడర్‌ను కలపటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌పై ఇంజనీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తానని, అతనికి బిల్లులు చెల్లించవద్దని కోరతానన్నారు. కార్యక్రమంలో వార్డు అధికారి జ్ఞానేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.



నాలాలో మట్టిని తీయిస్తున్న కౌన్సిలర్ పద్మారావు

తప్పిపోయిన మహిళను చేరదీసిన కపిలానగర్ వాసులు



ఆరు నెలల చిన్నారితో శివనీల

బండ్లగూడ: తిండి లేక, తెలిసిన వారి జాడ లేక ఓ మహిళ ఆరు నెలల పసి కందుతో రోడ్లపై తిరుగుతుంది. మంగళవారం ఆ మహిళ స్పృహ కోల్పోయి రోడ్డుపై పడిపోవడంతో హైదర్షాకోట్ కపిలానగర్ వాసులు ఆమెను చేరదీశారు. వివరాల ప్రకారం అంతరెడ్డిగూడ ప్రాంతానికి చెందిన శివనీల(28) తప్పిపోయింది. తన సొంత ఊరు తెలియక తన ఆరు నెలల పాపతో రోడ్లపై తిరుగుతుంది. మంగళవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్ కపిలానగర్‌లో సంచరిస్తున్న ఆమె మధ్యాహ్నం నీరసంతో రోడ్డుపై పడిపోయింది. దీనిని గుర్తించిన కపిలానగర్ వాసులు ఆమెను చేరదీసి భోజనం పెట్టించి వివరాలను సేకరించారు. అంతరెడ్డిగూడ తమ సొంత గ్రామం అని తన పేరు శివనీల అని, భర్త పేరు నాగుల మల్లేష్ అని చెప్పింది. గత కొన్ని రోజులుగా తప్పిపోయి తిరుగుతున్నట్లు వివరించింది. దీంతో స్థానికులు ఆమె సొంత వారి కోసం పోలీసులను ఆశ్రయించారు. హైదర్షాకోట్‌లోని కస్తూర్బా గాంధీ ట్రస్ట్‌కు సమాచారం అందించారు. ఆమె వివరాలు తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు.

మహిళ అదృశ్యం



పుష్పలత (ఫైల్)

శంషాబాద్: ఓ మహిళ అదృశ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు మంగళవారం చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని హుడాకాలనీకి చెందిన పుష్పలత(52) మంగళవారం తెల్లవారు జామున ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లింది. ఆమె కోసం గాలించినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిప్పంటుకుని గుడిసె దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ అత్తాపూర్ హుడా కాలనీలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మహబూబ్‌నగర్‌కు చెందిన హన్మంతు బతుకు దెరువు కోసం హుడా కాలనీకి వచ్చి పూరి గుడిసె వేసుకుని జీవనం సాగిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పు అంటుకుంది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న హన్మంతును పక్కనే ఉండే బంధువులు మణెమ్మ, వెంకటమ్మ బయటకు తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో హన్మంతుకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న వారు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. హన్మంతు దాచిపెట్టుకున్న నగదు, సామాగ్రి అగ్నికి ఆహుతయ్యాయి.

దేవర కరుణాకర్‌కు నివాళి

గోల్కొండ: దేవర కరుణాకర్ నిష్కలంక ప్రజా నాయకుడని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ టి.అమర్‌సింగ్ అన్నారు. గుడిమల్కాపూర్‌లో మంగళవారం దివంగత కార్పొరేటర్ దేవర కరుణాకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమర్‌సింగ్ మాట్లాడుతూ.. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తిగా దేవర కరుణాకర్ పేరు తెచ్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, సునీల్‌యాదవ్, దేవర వంశీ పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

మణికొండ: ప్రజలందరికి కంటి చూపు సమస్యలను నివారించేందుకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలను అందిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్ కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మాజీ సర్పంచ్ ఆర్. నర్సింహాలతో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ పలువురు కంటి సమస్యలు ఉన్నా పరీక్షలు చేయించుకోకపోవటం, మందులు సకాలంలో వాడక పోవటంతో అవి అధికం అవుతున్నాయన్నారు. వృద్ధులు ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. అలాంటి వారికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.రాజు, నర్సింహాలతో పాటు డాక్టర్ తహసీన్ బేగం, ఎంపీహెచ్ఎస్ అన్నపూర్ణ, సిబ్బంది ప్రణీత్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో కళ్లద్దాలను అందజేస్తున్న కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోంద్ర సంగీతగౌరీశంకర్



రాజేంద్రనగర్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోంద్ర సంగీత గౌరీశంకర్ అన్నారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ జనప్రియ అపార్ట్‌మెంట్‌కు వెళ్లే ప్రధాన రహదారిలోని శ్మశానవాటిక సమీపంలో చెత్త వేసే స్థలంలో మంగళవారం ఆమె కుర్చీలు, టేబుళ్లు ఏర్పాటు చేయించారు. జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులతో పాటు స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా అత్తాపూర్ కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్ జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికుడు జనార్దన్ అనే వ్యక్తి ఎప్పటికప్పుడు స్థలాన్ని శుభ్రంగా చేస్తుండడంతో అతడిని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అత్తాపూర్ డివిజన్ చెత్త రహిత డివిజన్‌గా తీర్చిదిద్దుదామని ఖాళీ స్థలంలో చెత్త వేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలు చెత్తను ఇంటి వద్దకు వచ్చే ఆటో రిక్షా కార్మికులకు అందించాలన్నారు. జీహెచ్‌ఎంసీ స్వచ్ఛ సర్వేక్షన్ ఆటోల ఇన్‌చార్జీ ప్రవీణ్‌రెడ్డి, ఎస్ఎఫ్ఏలు వినయ్, శంకర్, హరి, రాజు, కృష్ణ, రవీందర్, రాందాస్, చంద్రమోహన్, శేఖర్, డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి రావుల జగన్, బీటుకూరి సిద్ధేశ్వర్, సనివెల్లి శ్రీపాల్‌రెడ్డి తదితరులున్నారు.

అమర జవాన్లకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నేతలు

శంషాబాద్: పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు ఏబీవీపీ కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. శంషాబాద్ జిల్లా కన్వీనర్ చాకలి మహేష్, నగర కార్యదర్శి మనీషా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. దేశానికి రక్షణగా ఉన్న జవాన్ల త్యాగాలకు దేశప్రజలు ఎల్లవేళలా రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ప్రదీప్,అఖిల్, సంధ్య, మేఘన, పవన్, భరత్, భార్గవి, శివ, తిరుపతి, దినేష్ తదితరులున్నారు.

విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నాలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌లో పని చేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పీఆర్సీ అమలు, 29 డిమాండ్ల సాధన కోసం మంగళవారం భోజన విరామ సమయంలో ధర్నా చేపట్టారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లిలోని విద్యుత్ డివిజనల్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్–82, ఇతెహద్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ల ఆధ్వర్యంలో సంయుక్తంగా ఉద్యోగులు, ఆర్టిజన్లు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ యూనియన్ అధ్యక్షులు రాజు మాట్లాడుతూ ఏప్రిల్ 2022 నుంచి పీఆర్‌సీ ఇవ్వకుండా యాజమాన్యం దాటవేస్తుందని ఆరోపించారు. సంస్థ యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి వల్ల ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. యాజమాన్యం స్పందించని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు కిరణ్‌కుమార్, విజయేందర్, బాసిద్ అలీ, షేక్ అహ్మద్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానం ప్రారంభం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, ల్యాంకో హిల్స్ పక్కన ఉన్న వీరాంజనేయస్వామి దేవాలయం వద్ద నిత్యాన్నదానం కార్యక్రమాన్ని చేపట్టామని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని 12వ వార్డు కౌన్సిలర్ ఎస్. శ్వేతకిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాలయ ఆవరణలో ఇప్పటి వరకు కొందరు భక్తులు ప్రతి మంగళవారం అన్నదానం నిర్వహించేవారని, ఇకపై ప్రతి రోజు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అన్నదానం చేయాలనుకునే భక్తులు దేవాలయం వద్ద సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు ప్రవీణ్‌కుమార్, కె.రాజిరెడ్డి, కె.సుధాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, రాజేశ్, పి.రవి, డి.రవి, డి.లక్ష్మన్, నాయకులు అర్జున్, బి. రాములు, ఎస్. శ్రీధర్, మధు, రాములు తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230